# ప్రజాశక్తి

శనివారం 26 జులై 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్




కృష్ణా


## మూడేళ్లలో మెట్రో పూర్తి

- మంత్రి నారాయణ వెల్లడి
- ఎపిఎంఆర్‌సి, టిప్సా మధ్య ఒప్పందం
- త్వరలో టెండర్లు

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

విజయవాడ మెట్రోరైలు ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సి) తెలిపింది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం, పర్యవేక్షణ, సాంకేతిక సహకారం కోసం విజయవాడలోని ఏపీ సిఆర్‌డిఏ కార్యాలయంలో మంత్రి నారాయణ సమక్షంలో ఎపిఎంఆర్‌సి, టిప్సా ప్రతినిధులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. అయితే ఈ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ వాయిదాపడింది. మరో రెండు రోజుల్లో టెండర్లు ఆహ్వానించనున్నట్లు తెలిపింది. ఇప్పటికే ప్రాజెక్టుకు అవసరమైన 91 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపింది. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ 2014 ఎపి పునర్విభజన చట్టం ప్రకారం విశాఖ, విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉందన్నారు. రెండు మూడు రోజుల్లో విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు తొలదశ నిర్మాణానికి టెండర్లు పిలుస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాగా 20 శాతం, కేంద్రం వాటాగా 20, మిగతాది కేంద్రం అనుమతితో సాఫ్ట్ లోన్‌ను 30 ఏళ్ల కాలపరిమితితో తక్కువ వడ్డీ రేటుకు అంతర్జాతీయ సంస్థల నుంచి కేంద్రం అందిస్తుందని తెలిపారు. విజయవాడ మెట్రోను రాజధాని ప్రాంత అభివద్ధి సంస్థ (సీఆర్డీఏ) ఆధ్వర్యంలో మొదటి పేజ్‌ను రూ. 10,118 కోట్ల అంచనా వ్యయంతో 32.40 కిలో మీటర్ల మేర నిర్మిస్తామన్నారు. మొదటి కారిడార్‌ను 25.9 కిలోమీటరును పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి గన్నవరం ఎయిర్ పోర్టు వరకు, రెండో కారిడార్‌ను పండిట్ నెహ్రూ బస్టేషన్ నుంచి పెనమలూరు వరకు చేపట్టనున్నామని తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

## కొత్త పింఛన్లకు మోక్షం ఎప్పుడు?

- మహిళల ఎదురుచూపు
- ఏడాదిన్నరగా పెండింగ్లోనే దరఖాస్తులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** ప్రభుత్వం మారినా కొత్త పింఛన్ల మంజూరుకు మోక్షం కలగడం లేదు. భర్త చనిపోయిన తర్వాత భార్యలకు బాదలాయించే పింఛన్ల కోసం జిల్లాలో ఏడాదిన్నరగా అనేక మంది మహిళలు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో 2023 డిసెంబర్ నుండి నిలిచిపోయిన పింఛన్లకు రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఏడాదిదాటినా మోక్షం కలగడం లేదు. కృష్ణా జిల్లాలో వితంతు పింఛన్ల మంజూరుకు సుమారు మూడు వేల మంది ఏడాదిన్నరగా ఎదురు చూస్తున్నారు. ఎన్‌టిఆర్ భరోసా పేరుతో పింఛన్లు రూ.4 వేలకు పెంచి ఇస్తున్న ప్రభుత్వం... భర్త చనిపోయిన వారికి నెల రోజులలోపే ఆయనకు వచ్చే పింఛన్ భార్యకు బదలాయించి ఇస్తామని చెప్పిన హామీని మాత్రం ఆచరణలో అమలు చేయడంలేదు. ఇంటి పెద్ద దిక్కుకోల్పోయి బాధలో ఉన్న మహిళలకు ఎంతో కొంత ఆసరాగా నిలుస్తుందనుకున్న పింఛన్ డబ్బుల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ మహిళల ఆశలు అడియాశలుగానే మిగిలిపోతున్నాయి.

**ఇచ్చినట్లే ఇచ్చి వెనక్కి తీసుకున్న నిధులు**

పింఛన్ల మంజూరుకు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న మహిళలకు ప్రభుత్వం గత నెలలో పింఛన్లు ఇవ్వడానికి సచివాలయాల సిబ్బంది ద్వారా ఎంతో ప్రచార ఆర్భాటం చేశారు. నూతన పింఛన్లు స్థానిక మంత్రి చేతుల మీదుగా పంపిణీ జరుగుతుందని చెప్పి మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్సన్ సెంటర్లో అధికారులు సమావేశం కూడా ఏర్పాటు చేశారు. అయితే చివరి నిమిషంలో కార్యక్రమం రద్దయినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఎప్పటి నుండో ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న



మహిళలకు మరోసారి ప్రభుత్వం నుండి భంగపాటు తప్పలేదు. పంపిణీ ప్రక్రియలో భాగంగా జిల్లాలో అవసరమైన సుమారు రూ.1.12 కోట్లు ఆయా శాఖలకు ప్రభుత్వం విడుదల చేసింది. అయితే అదే సమయంలో తల్లికి వందనం పథకం అమలుకు సన్నాహం చేస్తుండడంతో ఆయా జిల్లాలకు మంజూరు చేసిన నిధులను ప్రభుత్వం మళ్లీ వెనక్కి డిపాజిట్ చేయించుకున్నట్లు ఆయా శాఖలు పేర్కొంటున్నాయి. దీనివల్ల జూన్లోనైనా పింఛన్ డబ్బులు వస్తాయని ఎదురు చూసిన వారికి మరోసారి భంగపాటు తప్పలేదు. జిల్లాలో మొత్తం 2,808 మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో మచిలీపట్నం నియోజక వర్గంలో 303, అవనిగడ్డలో 526, గన్నవరం 408, గుడివాడ 308, పామర్రు 441, పెడనలో 410, పెనమలూరు నియజకవర్గంలో 412 మంది ఉన్నారు. ఇవి మే నెలాఖరు వరకు మాత్రమే. మళ్లీ జూన్, జూలైల్లో చేసిన దరఖాస్తులు లెక్కలోకి రాలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం కొన్న పింఛన్లు వెంటనే మంజూరు చేసి తమకు భరోసా కల్పించేలా చూడాలని పలువురు మహిళలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్

**ప్రజాశక్తి - విజయవాడ :** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వచ్చే మూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేకంగా దష్టిసారించాలని, ఇళ్లలోకి నీళ్లు వచ్చే పరిస్థితి లేకుండా చూడాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) బందం నగరంలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసే 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డివిజన్ల స్థాయిలోనూ ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసి నిరంతరం పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు.




వి.ఎస్.అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబురావు, జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ తదితరులు

### జగనన్న కాలనీల్లో విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల

## తొలగింపును విరమించుకోండి

**సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్**

**ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల అభివద్ధి జరగకపోగా ఉన్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించడానికి ట్రాన్స్‌కో సిద్ధపడడం దారుణమని సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 647 జగనన్న లేఅవుట్లలో ప్రజల నివాసయోగ్యానికి అవసరమైన కనీస వసతులు సమకూర్చి అభివద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ట్రాన్స్‌కో అధికారులు జగనన్న కాలనీలు అసంపూర్తిగా ఉన్నాయన్న పేరుతో కాంట్రాక్టర్లను పురమాయించి అప్పటికే ఉన్న విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని ఆదేశించారని తెలిపారు. ఆ ఆదేశాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కనీస అవసరాలైన మంచినీరు, విద్యుత్, డ్రైనేజి, రోడ్లు తదితర వసతులు లేకుండా ప్రజలు ఎలా ఇళ్లు కట్టుకోగలుగుతారని, ఎలా జీవించగలుగుతారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి కేవలం రూ.1.35 లక్షలు మాత్రమే మంజూరు చేయడంతో కొంతమంది అప్పులు చేసి మరీ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఇంకా చాలామంది ఇళ్ల నిర్మాణం ప్రారంభించినా పునాదుల దశలో ఆగిపోయాయని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తొలగిస్తామంటే ఊరుకునేది లేదని తెలిపారు. జగనన్న కాలనీల లబ్ధిదారుల పక్షాన సిపిఎం పోరాడుతుందని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు మధ్యలో ఆపేసిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు మరో రూ.50 వేల డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు అందించిన ప్రభుత్వం... మిగిలిన అన్ని వర్గాల ప్రజలకూ రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ఎసిబి వలలో సీనియర్ అసిస్టెంట్

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** మచిలీపట్నం ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ త్రినాథ్ శుక్రవారం రాత్రి ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఓ రైతు వద్ద నుండి లంచం నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి బి.సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నం మండలం అరిసెల్లి గ్రామానికి చెందిన కొల్లిపర లక్ష్మీ నారాయణ తనకు చెందిన అగ్రికల్చరల్ ల్యాండ్ కన్వర్షన్ ఫైల్ మూవ్ చేసేందుకు త్రినాథ్ రూ.42 వేలు లంచం డిమాండ్ చేశారు. రూ.40 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిపై సంబంధిత రైతు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. దీంతో శుక్రవారం రాత్రి రైతు వద్ద లంచ డబ్బులు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు నేరుగా దాడి చేసి పట్టుకున్నారు.



### ప్రజా సమస్యలు, అభివృద్ధి గాలికొదిలి

## కార్పొరేట్లకు భూములు కట్టబెట్టే పనిలో ప్రభుత్వం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు, వెంకటేశ్వరరావు
- వి.ఎస్.అచ్యుతానందన్‌కు ఘన నివాళి

**ప్రజాశక్తి - విజయవాడ :** రాష్ట్రాభివృద్ధిని, ప్రజాసమస్యలను పూర్తిగా గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ భూములను కారు చౌకగా కట్టబెడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, వై.వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం సిపిఎం ఎన్‌టిఆర్‌జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. సిపిఎం కేరళ మాజీ ముఖ్యమంత్రి, పొలిట్‌బ్యూరో పూర్వ సభ్యులు విఎస్ అచ్చుతానందన్‌కు వై.వెంకటేశ్వరరావు, బాబూరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అచ్యుతానందన్‌తోపాటు ఇటీవల మృతిచెందిన పలువురు పార్టీ నాయకులకు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా, నాయకులు, పార్టీ శ్రేణులు రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపం తెలిపారు. అనంతరం (మిగతా 2లో)


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

## కృష్ణా జిల్లా అభివృద్ధికి కృషి : మంత్రి కొల్లు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :** కృష్ణా జిల్లాను అభివృద్ధిలో రాష్ట్రానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడానికి అధికారులు కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. మచిలీపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ మార్కెటింగ్ అధికారులతో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు, వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుబజార్లలో సదుపాయాలు మెరుగుపరచాలన్నారు. రోడ్లపై పశువుల సంచారాన్ని నివారించాలన్నారు. అవసరం మేరకు క్యాటిల్ షెడ్లకు పశువుల్ని తరలించాలన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచె నాని, మచిలీపట్నం నియోజక వర్గ ప్రత్యేక అధికారి, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సిహెచ్.నరసింహులు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి బలి చక్రవర్తి పాల్గొన్నారు.

## గురుకులాల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :** డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఇంకా మిగిలి ఉన్న సీట్లకు ప్రవేశ ప్రరీక్ష రాసి సీట్లు పొందనివారు, ప్రవేశ ప్రరీక్ష రాయని విద్యార్థినీ విద్యార్థులు సీట్లు ఖాళీగా ఉన్న మోటూరు, బల్లిపర్రు, రుద్రవరం, పామర్రు, తిరువూరు, కృష్ణారావుపాలెం పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి ఏ.మురళీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష రాయని విద్యార్థులకు ఖాళీలు ఉన్న పాఠశాలల్లో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలిపారు.

## కార్పొరేట్లకు భూములు కట్టబెట్టే పనిలో ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

బాబూరావు మాట్లాడుతూ మెట్రో ప్రాజెక్టుకు వంద శాతం నిధులు కేంద్రమే భరించేలా ప్రధాని కార్పొరేట్లకు భూములు కట్టబెట్టే పనిలో ప్రభుత్వం మోడీపై సిఎం చంద్రబాబు వత్తిడి తీసుకురావాలన్నారు. రాజధాని ప్రాంతంలో జరుగుతున్న పనులన్నీ అంతా బడా కార్పొరేట్ కంపెనీల అభివృద్ధికే తప్ప ఈ ప్రాంత ప్రజల అవసరాల కోసం కాదన్నారు. రూ.400 కోట్లు విలువైన ఐదెకరాల విజయవాడ పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ కంపెనీకి ధారాదత్తం చేసోందన్నారు. ఆర్‌టిసి విద్యాధరపురం డిపోను, స్పోర్ట్స్ సిటీ పేరుతో మరో 3 వేల ఎకరాలు... ఇలా ప్రభుత్వ భూములను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ బడాకంపెనీలకు కట్టబెట్టడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలో కట్టలేరుపై వంతెన దెబ్బతిని ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాగే 16 ఏళ్ల నుంచి విజయవాడ గుణదల ఫ్లైఓవర్ శిలాఫలకానికే పరిమితమైందని అన్నారు. బుడమేరు ముంపునివారణా చర్యలు ప్రకటనలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. బుడమేరు వరద నివారణా చర్యలకు రూ.7 వేల కోట్లకు గాను కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా రాలేదన్నారు.

**ఆధునిక కేరళ నిర్మాణంలో అచ్యుతానందన్ పాత్ర కీలకం : వై.వి.**

సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విఎస్ అచ్యుతానందన్ ఆశయాలను పార్టీ నాయకత్వం, శ్రేణులు ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. ప్రజల ద్వారా వెలుగులోకి వచ్చిన ప్రజానాయకుడన్నారు. పేద కుటుంబంలో జన్మించి, పీచు కార్మికుడుగా, పెద్ద చదువులు లేకపోయినా ఆధునిక కేరళ నిర్మాణంలో ఆయన పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతోందన్నారు. ప్రజలతో ఏ విధంగా మమేకమవ్వాలి, వారి పక్షాన ఏవిధంగా పని చేయాలనే అంశాలకు తోడు ఆయన నిరాడంబర జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ స్థానిక సమస్యలు-కర్తవ్యాలపై మాట్లాడారు. స్మార్ట్‌మీటర్లు పెట్టొద్దని, పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాల వద్ద నిర్వహించే ధర్నాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోయి సత్యబాబు, పి.వి.ఆంజనేయులు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, కోట కళ్యాణ్, ఎం నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'సెంట్రల్'లో మంత్రి అచ్చెంనాయుడు పర్యటన

**ప్రజాశక్తి - విజయవాడ :** 'సుపరిపాలనలో తొలి అడుగు – ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సెంట్రల్ నియోజకవర్గంలోని 64వ డివిజన్ కండ్రిక 106వ బూత్ బివి సుబ్బారెడ్డి స్కూల్ వద్ద రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు, ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొండా ఉమామహేశ్వరరావు ప్రజల సమస్య అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి అచ్చెంనాయుడు మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని నాశనం


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెంనాయుడు

చేసిందన్నారు. గత ఐదేళ్ల పాలనను రాష్ట్ర ప్రజలంతా చూశారని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా టిడిపి శ్రేణులు చెక్కు చెదరలేదన్నారు. ఎంఎల్ఎ బొండా ఉమా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి టిడిపి హయాంలోనే జరిగిందన్నారు.

## విజయవాడలో పెన్షనర్ల నిరసన

**ప్రజాశక్తి - విజయవాడ :** పింఛనుదారులకు నష్టం చేకూర్చేవిధంగా పార్లమెంట్లో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లును, వ్యాల్యూడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యాన శుక్రవారం విజయవాడ అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్ వద్ద మానవహారం నిర్వహించారు. బిఎస్ఎన్ఎల్, పోస్టల్, కస్టమ్స్ ఎక్సైజ్, ఆలిండియా రేడియో, ఎల్ఐసి, ఆదాయపు పన్ను శాఖ సంస్థల్లో వివిధ హోదాల్లో పని చేసిన విశ్రాంత సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్ల కార్డులు చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలు నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎన్.రామారావు మాట్లాడుతూ 1972 కేంద్ర ప్రభుత్వ పెన్షన్ చట్టంలో మార్పులు చేస్తూ లోక్ సభలో గత మార్చి 25న ఆర్థిక బిల్లుతోపాటు, పెన్షనర్ల బిల్లును ఆమోదించి రాష్ట్రపతి ఆమోదంతో జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ 1982 డిసెంబర్ 17 నాటి డిఎస్ నకరా కేసులో సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఉందన్నారు. దీంతో పెన్షనర్లు తీవ్ర ఆందోళనలో ఉన్నారని


విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

వివరించారు. నూతన పెన్షన్ బిల్లు పెన్షనర్ల మెడపైన వేలాడే కత్తిలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఎం.ఆర్.ఎస్.ప్రకాశరావు మాట్లాడుతూ 8వ వేతన సంఘాన్ని జనవరి 2025లో ప్రకటించి నేటివరకు ఛైర్మన్‌గానీ, సభ్యులను గాని నియమించలేదన్నారు. ఈకార్యక్రమంలో ఫోరం కో కన్వీనర్లు ఏ చంద్ర శేఖర్, ఏ కోటేశ్వరరావు, వివిధ సంఘాల ప్రతినిధులు నిమ్మగడ్డ నాగేశ్వరరావు, ఎల్ రమేష్ బాబు, ఈ భాను బాబు, పి ఎన్ వి ప్రసాద్, శ్రీ రంగనాథ్, జమిలిరెడ్డి, ఎన్ఎ శాస్త్రి, పి కష్ణ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్‌పేట డిపో వద్ద ఇయు ధర్నా

**ప్రజాశక్తి - విజయవాడ :** నగరం నడిబొడ్డులో ఉన్న ఏపియస్ ఆర్టీసి గవర్నర్ పేట 1, 2 డిపోల స్థలాలను, పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ కంపెనీకి అప్పగించడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. వందల కోట్ల విలువైన ఐదెకరాల స్థలాలను లులూ షాపింగ్ మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టే ఆలోచనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విజయవాడ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. 1, 2 డిపో ఉద్యోగులతోపాటు పలువురు ఆర్‌టిసి ఉద్యోగులు



పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి పిటిడి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.వి.నరసయ్య పాల్గొన్నారు.

## న్యాయవాదుల నిరసన

**ప్రజాశక్తి - విజయవాడ :** రాష్ట్రంలో న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలని, న్యాయస్థానాల్లో ఖాళీగా ఉన్న న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూషన్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక సివిల్ కోర్టుల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నూతన భవనాలు నిర్మించాలని, న్యాయమూర్తుల సంక్షేమ నిధిని రూ.6 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచాలని, మరణించిన వారి కుటుంబాలకు ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంటు బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పేదరికంలో ఉన్న న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, హెల్త్




కార్డులు ఇవ్వాలని కోరారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ బాషా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం ఉప ప్రధాన కార్యదర్శి ఎంఎ షరీఫ్, ఉపాధ్యక్షులు కెవివి పరమేశ్వరరావు, కే ఎస్ సుధాకరరాజు, కోశాధికారి బోను జయమ్మ, సహాయ కార్యదర్శి ఈ ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

## టాటా ఇన్నోవేషన్ హబ్‌తో స్టార్టప్‌లకు కొత్త ఊపు : కలెక్టర్

**ప్రజాశక్తి - విజయవాడ :** రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టిఐహెచ్), స్పోక్స్ ద్వారా స్టార్టప్‌లకు కొత్త ఊపు రానుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం వివిధ స్టార్టప్ కంపెనీలు ఏర్పాటుచేసిన స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతలకు, కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు అమరావతిలో రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నారని, దీనికి అనుసంధానంగా ఎన్‌టీఆర్ జిల్లాకు కూడా ఒక స్పోక్‌ను కేటాయించారని తెలిపారు. విజయవాడలోని ఎనికేపాడులో రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్



స్పోక్‌ను త్వరలోనే ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని చెప్పారు. జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు పాల్గొన్నారు

## ఈవ్‌టీజింగ్ నివారణపై అవగాహన

**ప్రజాశక్తి - చల్లపల్లి :** స్థానిక సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పి.ఎస్‌వి.సుబ్రహ్మణ్యం, శక్తి టీమ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఈవ్ టీజింగ్ సమస్యలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల భద్రతను కాపాడడంలో శక్తి టీమ్ చురుకుగా పనిచేస్తుందని తెలియజేశారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు డయల్ 112 లేదా 1930 టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

## అక్షరాంధ్ర.. స్వర్ణాంధ్రకు వెలుగుబాట : లక్ష్మీశ

**ప్రజాశక్తి - విజయవాడ :** స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి అక్షరాంధ్ర వెలుగుబాట అని.. సమష్టి కృషితో అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఉల్లాస్–అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమంపై కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి సంబంధించి అక్షరాస్యత లక్ష్యాలను చేరుకునేందుకు సరైన ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. వయోజనులైన నిరక్షరాస్యులను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గుర్తించడం జరిగిందని, వీరందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్ది జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషిచేయాలన్నారు. 2024–25లో ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం కింద ఎంపిక చేసిన 16 గ్రామీణ మండలాల్లో నిరక్షరాస్యులయిన స్వయం సహాయక సంఘ మహిళలను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి జి.ప్రసాదరావు, డీఈవో యూవీ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, ఐసీడీఎస్ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.



**మహారాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్) :: నర్సరావుపేట,**
**ఇ.ఏ.నెం.109/2024 ఇన్ ఇ.పి.నెం.47/2023 ఇన్ ఓ.యస్.నెం.7/2020**

1) తియ్యగూర నాగరత్నమ్మ (డైడ్)
2) నక్కా కోటేశ్వరమ్మ వురఫ్ తియ్యగూర కోటేశ్వరమ్మ ...డి.హెచ్.ఆర్./పిటీషనర్

వర్సెస్

**R5)** శ్రీమతి సోమిశెట్టి వెంకటలక్ష్మీ సువర్ణ, భర్త : శ్రీనివాసరావు, ఏలూరురోడ్, సత్యసాయిబాబా మందిర్ ఎదురు, విజయవాడ...ప్రపోజ్డ్ యల్.ఆర్

పైన తెలిపిన కేసును డి. హెచ్.ఆర్. 1వ, 2వ ప్రతివాదులపై డిక్రీ అమలు నిమిత్తము పై కోర్టులో ఇ.పి. దాఖలు చేసి దరిమిలా 1వ జె.డి.ఆర్. చనిపోయినందున వారి స్థానములో వారసులుగా మిమ్మలను చేర్చుటకు మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు కోర్టుద్వారానూ, పోస్టల్ ద్వారానూ పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. ఇట్టిస్థితిలో శ్రీ కోర్టువారు ఈప్రకటన ద్వారా నోటీసు మీకు తెలియపరచవలసినదిగా ఆదేశించి, సదరు కేసును ది.14-08-2025కు వాయిదా వేసి వున్నారు. కనుక పైనతెల్పిన తేదీన ఉదయం 10.00 గం.లకు మీరు స్వయముగాగాని, ప్లీడరుద్వారా గాని పైకోర్టునందు హాజరై మీఆక్షేపణలు తెలియజేసుకొన వలెను. లేనియెడల సదరు కేసును మీ పరోక్షములో తీర్మానము చేయబడును.

చిలకలూరిపేట
తేది:26-07-2025

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఇట్లు,
నక్కా రమేష్ బాబు,
న్యాయవాది, చిలకలూరిపేట
సెల్ నెం. 9848850512



## వర్షాలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-చల్లపల్లి :** గత రెండు రోజులుగా జిల్లాలకు వస్తున్న అకాల వర్షాలకు వివిధ దశలలో ఉన్న వరి పంట ముంపుకు గురి అయ్యే ప్రమాదం ఉన్నందున సమయానుకూలంగా జాగ్రత్తలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి సుధారాణి రైతులకు తెలిపారు. చల్లపల్లి మండలంలోని పాత మాజేరు, కొత్త మాజేరు పరిసర ప్రాంతాలలో పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం వరి నారు మడులను, ఎద పద్ధతిలో సాగు చేస్తున్న శుక్రవారం పరిశీలించారు. వర్షాలకు నారుమడిలో విత్తనం చల్లిన 2-3 రోజుల వయసులో 3 కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. వీలైనంత త్వరగా నీరు బయటకు తీసి వేయాలని సూచించారు. విత్తిన 7 నుండి 30 రోజుల మధ్యలో నారు 5 కన్నా ఎక్కువ రోజులు మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉన్నందున మునిగిన నారుమడి లో నుండి నీరు 5 రోజుల లోపు పూర్తిగా బయటకు తీసివేసిన తర్వాత 5 సెంట్ల నారుమడికి 1 కిలో యూరియా కిలో పోటాష్ వేయాలని చెప్పారు. సస్యపోషణ శాస్త్రవేత్త వెంకట లక్ష్మి, సస్యరక్షణ శాస్త్రవేత్త రేవతి పాల్గొన్నారు.

## 15 రోజుల్లోగా డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలి

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు వారి సర్క్యులర్లు, చట్టాలు, నియమాలు తదితర డాక్యుమెంట్లు 15 రోజుల్లోగా ఆర్టీజీఎస్ లాగిన్‌లో అప్లోడ్ చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుండి వివిధ శాఖల జిల్లా అధికారులు క్షేత్రాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆర్టిజిఎస్, పి 4 సర్వే, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, సచివాలయు ఉద్యోగుల విడుదల, చేరిక, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, ఐ గాట్ కర్మయోగి శిక్షణ, వీధి వ్యాపారుల సర్వే, కాలానుగుణ వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టిజిఎస్) లాగిన్ లోకి అన్ని ప్రభుత్వ కార్యాలయాల సర్క్యులర్లు, చట్టాలు, నియమాలు, ఉత్తర్వులు తదితర డాక్యుమెంట్లు తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని ఆదేశించిందన్నారు. ప్రతి జిల్లాకు 3 లక్షల డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలన్నది లక్ష్యం కాగా జిల్లాలో ఇప్పటివరకు కేవలం 3,300 మాత్రమే అప్లోడ్ చేశారన్నారు. ఈ ప్రక్రియను ముమ్మరంగా చేపట్టి వచ్చే 15 రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, జెడ్పి డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, గహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నటరాజు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అడుగడుగునా గోతులు.. వాహనదారుల ఇబ్బందులు

**ప్రజాశక్తి-ఉంగుటూరు :** అడుగడుగునా గోతులతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉంగుటూరు మండలంలోని మానికొండ-తరిగొప్పల గ్రామాల మధ్య ఆర్ఎంబి రహదారి చెరువును తలపించేలా నీటితో గోతుల మయంగా మాడంతో సుమారు మూడు కిలోమీటర్ల దూరం నరకయాతన పడుతూ ప్రయాణిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ రహదారి గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు మండలాల గ్రామాలకు చెందిన రహదారి గన్నవరం నుండి గుడివాడ వరకు కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం, భూతిమిల్లిపాడు, తరిగొప్పల, వేంపాడు, మారేడు మాక మానికొండ, నందమూరు, కలువపాముల తదితర గ్రామాలను కలుపుతూ గుడివాడ వరకు నిరంతరం రోజుకు నాలుగు పర్యాయాలు రద్దీగా ఆర్టీసీ బస్సు ప్రయాణం కొనసాగుతుంది. ఇన్ని గ్రామాల ప్రజల ప్రయాణం తో పాటు అత్యదికంగా వ్యవసాయ భూములు కలిగిన ప్రాంతం కావడంతో వ్యవసాయ అవసరాల నిమిత్తం ఈ గ్రామాల రైతులు అనేక అవస్తలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మానికొండ-తరిగొప్పల రహదారి



సాత్విక్‌ను అభినందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

## సాత్విక్‌కు మంత్రి అభినందనలు

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** ప్రభుత్వ. అమలు చేసిన విదేశీ విద్య పథకంతో విదేశాల్లో చదువుకుని.. వ్యాపారవేత్తగా మారి మరికొందరికి చేదోడుగా నిలిచేందుకు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విదేశీ విద్య ద్వారా ఐర్లాండ్ లో చదువుకుని, అక్కడే వ్యాపారం ప్రారంభించిన సాత్విక్ మురారి అనే యువ వ్యాపారవేత్త మంత్రి కొల్లు రవీంద్రని శుక్రవారం వారి క్యాంపు కార్యాలయంలో కలిసారు. ఈ సందర్భంగా సాత్విక్ మురారిని మంత్రి సన్మానించారు. పేద విద్యార్థులకు విదేశాల్లో చదువుకునేందుకు స్కాలర్ షిప్ అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమాజానికి తోడుగా నిలవాలని ఆలోచన రావడం అభినందనీయం అన్నారు.

## స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించండి



**ప్రజాశక్తి-కంకిపాడు :** రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇంటింటికీ తిరుగుతూ బలవంతంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ జరిగే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని విద్యుత్ వినియోగ దారుల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక పార్థసారథి కళ్యాణ మండపం నందు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక కన్వీనర్ ఎస్ కే ఖాసిం మాట్లాడుతూ తాడిగడప మున్సిపల్ పరిధిలో సంతకాలు సేకరణ చేయాలని, ఆగస్టు 5 న విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టాలని కోరారు. సమావేశంలో సిపిఐ నాయకులు మోతుకూరి అరుణకుమార్, ఐక్య వేదిక ప్రతినిధులు స్థానిక పెద్దలు ఎస్కే బాబు, పి మాధవ్, మహిళా సంఘం నాయకులు వలీమా పాల్గొన్నారు

## సచివాలయ ఉద్యోగులకు సన్మానం

**ప్రజాశక్తి-అవనిగడ్డ :** మండల పరిధిలోని పులిగడ్డ గ్రామపంచాయతీ సచివాలయంలో బదిలీపై వెళుతున్న సచివాలయం సిబ్బందికి గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్ భార్గవ్, అగ్రికల్చరల్ డిపార్ట్మెంట్ సౌమ్య, అనిమల్ హస్బండ్రీ డిపార్ట్మెంట్ శైలజ, సర్వేయర్ ప్రవీణ్, ఏఎన్ఎం సుగుణలను సత్కరించారు. వైస్ ఎంపీపీ పులిగడ్డ ఇచ్చేశ్వరరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామపంచాయతీలో పనిచేసిన సచివాలయ ఉద్యోగుల సేవలు అనిర్వచనీయమని సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు కొనియాడారు. ఇటీవల చిట్టూర్పు సచివాలయం నుంచి బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు, వేరే ప్రాంతం నుంచి బదిలీపై గ్రామానికి వచ్చిన సచివాలయ ఉద్యోగులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఉప సర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు శ్రీ లక్ష్మీ కష్ణవేణి పాల్గొన్నారు.

# హైకోర్టు ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాదులు

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ :** పట్టాభి స్మారక భవన నిర్మాణ అంశంపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ పాలకవర్గం అమలు చేయక పోవడంపై జిల్లా మెజిస్ట్రేట్ హెూదాలో కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దివి పోతురాజు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య జ్ఞాపకార్థం ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మించే కన్వెన్షన్ హాల్, మ్యూజియం, లైబ్రరీ నిర్మాణమునకు మచిలీపట్నం నగర కార్పొరేషన్ కౌన్సిల్ ఎజెండాలో పెట్టి చర్చించమని హైకోర్టు ఈ ఏడాది ఏప్రిల్ 25వ తేదీ న ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ , అధికారులు, మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ , కౌన్సిల్ సభ్యులు ఎందుకు అలసత్వం వహిస్తూ ఉన్నారో బందరు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పసుమర్తి సూర్య ప్రకాష్, ఎం. నరేంద్రనాథ్, జి. వంశీకష్ణ, పి. ప్రియా కత్, కె. రఘురాం, వై. కిరణ్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానివి మోసపూరిత హామీలు : కైలే

**ప్రజాశక్తి-పామర్రు :** కూటమిప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి తద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ అన్నారు. స్థానిక బొమ్మారెడ్డి సీతరెడ్డి కళ్యాణ మండపంలో శుక్రవారం పామర్రు మండలస్థాయి వైయస్సార్సీపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కైలే అనిల్ మాట్లాడుతూ నేటి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని దానిపై ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులను కార్యకర్తలను కేసులతో వేధిస్తుందన్నారు. తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వంపై అనేక నిందలు వేస్తుందన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి వైఎస్ఆర్సిపిపై కక్ష సాధింపు చర్యలు తీసుకుంటుందన్నారు. పరిపాలనకు భారత రాజ్యాంగాన్ని వదలి ఎర్రబుక్కు రాజ్యాంగాన్ని అమలు చేస్తుం దన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కాకర్లవెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ.దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ.తాడిశెట్టి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

## కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం శుక్రవారం సంధర్భంగా అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఈవో ఆకుల కొండలరావు దంపతులు ప్రత్యేక పూజలో పీటలపై కూర్చొని పూజలు నిర్వహించినారు. అర్చకులు రుద్రపాక శివ సంతోష్ శర్మ ఈ ప్రత్యేక పూజలను వేద మంత్రోచ్చారణతో నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొగా అత్యధిక స్థాయిలో భక్తులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



## పలుచోట్ల పిఎసిఎస్ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

**ప్రజాశక్తి-ఉయ్యూరు :** చినఓగిరాల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం పాలక వర్గం శుక్రవారం ప్ర మాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. సంఘం అధ్యక్షునిగా గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ టీడీపీ నాయకుడు పాలడుగు రామకృష్ణ, డైరెక్టర్లుగా స్టాన్లీ జోసఫ్, కె. దుర్గారావులతో ప్రమాణస్వీకారం చేయించారు. రైతులకు ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివద్ధి పథకాలు సక్రమంగా అందేలా పనిచేస్తామని రామకృష్ణ స్టాన్లీ జోసఫ్ తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యకుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కొండాప్రవీణ్, పార్టీ మండల అధ్యకుడు యెనిగళ్ల కుటుంబరావు, సర్పంచ్ యెనిగళ్ల శిరీష, మాజీ సర్పంచ్ నాగభూషణం పాల్గొన్నారు.

**చినముత్తేవి పిఎసిఎస్ అధ్యక్షుడిగా కొసరాజు.**

**ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండలం చినముత్తేవి పిఏసిఎస్. అధ్యక్షునిగా కొసరాజు ప్రకాష్ మాధుర్ (పెదముత్తేవి) శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అలాగే డైరెక్టర్లుగా మురారి శివ నాగరాజు (కొండవరం), సుంకర వెంకటేశ్వరరావు (చినముత్తేవి)లు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వర రావు, వీరంకి తులసీదాస్, సర్పంచ్ కొమ్ముసౌదామణి, ఎంపీటీసీ గారపాటి భాగ్యలక్ష్మి, టిడిపి సీనియర్ నాయకులు భోగాది నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఉయ్యూరు మండలంలో...



మొవ్వ మండలంలో...

# రోడ్లు గుంతలమయం... ప్రయాణం ప్రమాదకరం

ప్రజాశక్తి-మైలవరం: రోడ్లు గుంతలు లేకుండా చేస్తామని చెప్పిన నేటి పాలకుల మాటలు నీటి మూటలయ్యాయి. నెలలు గడుస్తున్నా ఎక్కడ గుంతలు అలాగే దర్శనమిస్తున్నాయి. వర్షాలు పడటంతో గుంతలు మరింత పెద్దవిగా ఏర్పడి ఆ గుంతల్లో నీళ్లు ఉండటంతో గుంతలు కనపడక వాహనదారులు గుంతల్లోపడటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పాలకులు చెప్పిన మాయమాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయని, ప్రమాదకరంగా ఉన్న రహదారులపై పరాయణించటం కష్టంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైలవరం మండలంలో వెల్వడం, చంద్రాల, గణపవరం, మైలవరం దేవుని చెరువు ప్రధాన రహదారి పై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గణపవరం, వెల్వడం, చంద్రాల గ్రామంలోని ప్రధాన రహదారిపై పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో కనిపించక పోవడంతో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ను,వేగంగా ఆ గోతులలో దింపడంతో అవికాస్తా దెబ్బతిని త్వరగా మరమ్మత్తులకు గురవుతున్నాయి. ద్విచక్ర వాహనాలు స్కిడ్ ఐ గుంతలలో పడటంతో కాళ్ల చేతులు విరుగుతున్నాయని మహిళలు వాపోతున్నారు. గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

**ప్రమాదకరంగా గుంతలు**

వెల్వడం, చంద్రాల, గణపవరం గ్రామాలలో రహదారులపై పడిన గుంతలు ప్రమాదకరంగా



ఉన్నాయి. ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. చంద్రాల నుండి మైలవరం వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్ల కు గంట ప్రయాణం పడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ రహదారులపై నిత్యం బస్సులు, లారీలు, ఆటోలు,ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఇతర రవాణావాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు, ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.పలువురు రైతులు పొలాలకు సంబంధించి ఎరువులు, మందు కట్టలు తదితర వ్యవసాయ సామాగ్రి కావాలన్నా మైలవరం రావాల్సి ఉంటుంది. చంద్రాల, గణపవరం తదితర గ్రామాలకు చెందిన రైతులు వామ్మో మైలవరం వెళ్లాలంటేనే రహదారులు చూస్తుంటే భయమేస్తుందని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

**పనులకు వెళ్లలేకపోతున్నాం**
**సంధి పాము విజయ్, పెయింటింగ్ మేస్త్రి, గణపవరం.**



వెల్వడం, గణపవరం రహదారులపై పడిన గోతుల వల్ల సకాలంలో పనులకు వెళ్ళలేకపోతున్నాము. వాహనాలు అగోతుల్లో పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సమయానికి పని ప్రదేశానికి చేరుకోలేకపోవడంతో సమయం అంతా వృధాగా పోతుంది. చేతి కింద పని వాళ్లు కూడా రహదారులు బాగోలేకపోవటంతో రాలేని పరిస్థితి నెలకొంది. త్వరగా రహదారులపై పడిన గోతులను పూడ్చాలి.

**ప్రయాణించడం కష్టమే**
**శివనాథం శివకృష్ణ, వెల్వడం.**



నెల కాదు రెండు నెలలు కాదు దాదాపు ఏడాది నుంచి ప్రధాన రహదారులపై పడిన గుంతల వల్ల ప్రయాణం నరకప్రాయంగా ఉంది. అనేకసార్లు అధికారులు ప్రజా ప్రతినిధులకు విన్నవించిన ఫలితం లేదు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించగా ఎదురెదురుగా వాహనాలు ఢీకొనటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలి.

## శ్రీ చైతన్య వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: శ్రీ చైతన్య (ఇంద్ర టవర్స్) కళాశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం మన కల్యాణ మండపంలో ఘనంగా జరిగాయి. శ్రీచైతన్య విద్యా సంస్థల కార్యనిర్వాహక ఏజిఎం మద్దినేని మురళీకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గత ఏడాది



నీట్‌లో ఉత్తీర్ణులై మెడికల్ సీట్లు పొందిన విద్యార్థులకు, వివిధ స్పోర్ట్స్ లలో పతకాలు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ సురేష్‌బాబు మెడికోలను అభినందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజిఎం పి రామకృష్ణ , డీన్ బి రవీంద్ర పర్యవేక్షించారు.

## వ్యవసాయ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో జిల్లా వనరుల శాఖ డిడిఏ వెంకటేశ్వర్లు (గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యానవన సహాయకులు, మల్టీపర్పస్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్స్, వ్యవసాయ విస్తరణ అధికారి లకు ప్రస్తుతం పంటలకు సంబంధించి సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర పురుగుల యాజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్నటువంటి పరిస్థితుల్లో జీవన ఎరువుల ప్రాముఖ్యత, వ్యవసాయ శాఖలో ఉన్న వివిధ వ్యవసాయ, వ్యవసాయేతర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మైలవరం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం బీసీ ల్యాబ్ వ్యవసాయ సంచాలకులు కిరణ్ జ్యోతి, మైలవరం టెక్నికల్ వ్యవసాయ అధికారి వాసుదేవనాయక్, జి కొండూరు ,మైలవరం, ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అధికారులు సంధ్యారాణి, సూరిబాబు రజని పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల వితరణ

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థి, ప్రస్తుతం సీజీఎస్ టీ సూపరిం టెండెంట్ గా పనిచేస్తున్న డివికె కిషోర్ జన్మదినం సందర్భంగా కళాశాలకు ఇన్వర్టర్, ప్రింటర్ బహుకరించారు. కళాశాల విద్యార్థులకు బోర్డు నుంచి ఆన్లైన్లో వచ్చే అంతర్గత పరీక్షా ప్రశ్నపత్రాలను ప్రింట్ తీసి పరీక్ష వ్రాయించడానికి ప్రింటర్ లేక ఇబ్బందులు పడుతున్నట్లు అధ్యాపకులు తెలపడంతో కిషోర్ సతీమణి, ఐఎఫ్ఎస్ అధికారిణి క్షితిజ ద్వారా రూ.46 వేల విలువైన ప్రింటరును, ఇన్వర్టరును ప్రిన్సిపాల్ జీవీఎస్ లక్ష్మికి అందజేశారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు మురళీకృష్ణ, గోపిశెట్టి నరసింహారావు, అజయ్, పూర్వ విద్యార్థులు కొత్తగుండ్ల నాగేంద్ర రావు, ఎంవీఆర్ నరసింహారావు, కేశవరావు పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానం

ప్రజాశక్తి-విజయవాడసిటీ: రక్తదానం మహాదానమని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమాన్ని శుక్రవారం



ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఇప్పటికీ రక్తం సకాలంలో అందక ప్రాణాలో కోల్పోతున్న వారి సంఖ్య గణనీయంగా ఉందన్నారు. అవకాశం, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయటానికి ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్, ఎన్ఎస్ఎస్ పీవో బీ శ్రీకాంత్‌రెడ్డి, కోఆర్డినేటర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం అడవిరావులపాడులో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అడవి రావులపాడు నుంచి నందిగామ వైపు వెళుతున్న ఆటోను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాపుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

కాపులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ పరంగా మద్దతు తెలపాలని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డికి రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం విజయవాడలోని పిసిసి కార్యాలయంలో షర్మిలారెడ్డిని కలిసిన రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్ధన్, నాయకులు ఆకుల శ్రీనివాస్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ కాపు సామాజిక వర్గ సమస్యలపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు 10 శాతం ప్రత్యేక బీసీ రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాపు నేతలు అల్లం పూర్ణచంద్రరావు, రెడ్డిపల్లి సురేష్, పెన్నేరు దామోదర్ రావు, సుంకర సాంబశివరావు, భావ నారాయణ, నరహరిశెట్టి నరసింహారావు, అందే శ్రీరామమూర్తి, బై పూడి నాగేశ్వరరావు, అల్లం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాధ్యం కాని హామీలతో మోసం : తన్నీరు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ సుపరిపాలన కార్యక్రమం నిర్వహించే నైతిక హక్కులేదని జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహించారు. మండల అధ్యక్షులు బూడిద నరసింహారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి శివరాత్రి పద్మ రాజ్, జిల్లా యువజన కార్యదర్శి బజార్ సాయి, జిల్లా కార్యదర్శి మాతంగి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గగుడిలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రి యాత్రికులతో శుక్రవారం రద్దీగా మారింది. శ్రావణమాసం తొలి శుక్రవారం రోజున దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయాన్ని ప్రత్యేక పూల అలంకరణలతో సర్వంగా సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాకారగోపురంలో ఉదయం నుంచే ప్రత్యేక కుంకుమార్చనలు పూజలు కొనసాగాయి. శ్రావణ మాసం నెల రోజుల పాటు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు, ఒక గంటకు ఒక బ్యాచ్ చొప్పున ప్రత్యేక కుంకుమార్చనలు ఉభయ రుసుము రూ.వెయ్యి పూజకు ఇరువురు పాల్గొనవచ్చని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శీనా నాయక్ తెలిపారు.

## 'ప్రగడ కోటయ్యకు భారతరత్న ఇవ్వాలి'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: చేనేత పరిశ్రమ పితామహుడు ప్రగడ కోటయ్యకు భారతరత్న ఇవ్వాలని వైసిపి చేనేత విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు కోరారు. కోటయ్య దేశంలోని ముఖ్యమైన పట్టణాల్లో ఆంధ్ర హ్యాండ్లూమ్ విక్రయశాలలను స్థాపించి, ప్రాథమిక చేనేత సహకార సంఘాలలో తయారైన వస్త్రాలను విక్రయాలు జరిపించి, మార్కెటింగ్ వ్యవస్థను ఆర్థికంగా ఎంతో బలోపేతం చేసి లాభాలలో నడిపించారని తెలిపారు. చేనేత పరిశ్రమ ఆధునీకరణకు కృషి చేశారని, అసంఘటిత రంగంలో పని చేస్తున్న చేనేత కళాకారులందరినీ సహకార రంగంలోకి తీసుకువచ్చి, సహకార సంఘాలలో సభ్యులుగా చేర్పించడంలోనూ, కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయడంలోనూ కృషి చేశారన్నారు.

## పాముకాటుకు మహిళా రైతు మృతి

ప్రజాశక్తి-వీరులపాడు: జయంతి గ్రామంలో గత ఆదివారం మధ్యాహ్నం తాటి హలీమా పాముకాటుకు గురై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆరు రోజులుగా కోమాలో ఉండి శుక్రవారం మృతిచెందింది. హలీమాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## ఇసుక లోడింగ్‌కు అవకాశమివ్వాలి : నూతలపాటి

ప్రజాశక్తి-వత్సవాయి: పెనుగంచిప్రోలు గ్రామంలోని నూతలపాటి ఫంక్షన్ హాలులో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ దేవాలయ మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మున్నేరు రేవులో ట్రాక్టర్ల వద్ద 500 రూపాయల నగదును వసూలు చేస్తున్నారన్నారు. రోజుకి వంద ట్రాక్టర్ల ఇసుక లోడింగ్ అవుతున్నాయని, వీటిలో సుమారు 30 ట్రాక్టర్లలోపే స్థానిక ప్రజానికానికి ఉపయోగపడుతున్నాయని ఆయన తెలియజేశారు. మిగిలినవి ఇతర ప్రాంతాలకు ఇసుక రెండున్నర రెట్లు గిరాకీ ఉండటంతో తరలి వెళ్తున్నాయని అన్నారు. ఇసుకను అందరికి అందించాలనే ఉద్దేశంతో తాను లోడింగ్ ఫ్రీగా చేస్తానని, ఈ అవకాశాన్ని స్థానిక నాయకులు ఆలోచించాలని కోరారు.

## ఫెర్టీ9లో సంతానోత్పత్తికి ఎఐ ఆధారిత పరీక్ష

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఫెర్టీ 9 ఫెర్టిలిటీ సెంటర్‌లో శుక్రవారం ప్రత్యేక వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ సుమ మాట్లాడుతూ అత్యాధునిక ఎఐ ఆధారిత సెమెన్ ఎనలైజర్, లెన్సూక్ ఎక్స్12 ప్రో ను పరిచయం చేస్తున్నామని అన్నారు .తమ సంస్థ సంతానోత్పత్తి సంరక్షణ రంగంలో నూతన ఆవిష్కరణలు ప్రారంభించామని అన్నారు .. ఈ ఆవిష్కరణతో, సంస్థ ఆంధ్రప్రదేశ్ తెలంగాణలోని తన అన్ని కేంద్రాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసిన తొలి ఐవిఎఫ్ చెయిన్‌గా నిలిచింది అన్నారు. ఇది ఖచ్చితమైన రోగనిర్ధారణ, సమగ్ర పునరుత్పత్తి సంరక్షణ కలిగి ఉందని, ముఖ్యంగా పురుషుల వంధ్యత్వం వంటి కీలక అంశాలను గుర్తించి, వాటిపై సమగ్రంగా స్పందించే అత్యవసరత ఇప్పుడు ఎప్పటికన్నా ఎక్కువగా ఉందన్నారు. డిఎన్ఎ ఫ్రాగ్మెంటేషన్ ఇండెక్స్ (డిఎఫ్ఐ) స్థాయి ఎక్కువగా ఉన్నప్పుడు, గర్భస్రావం రేట్లు 20–25 శాతానికి పెరిగే ప్రమాదం ఉందని, అంతేకాకుండా దీనితో పాటు తక్కువ జనన బరువు మరియు




ముందస్తు పుట్టుకల అవకాశాలు కూడా పెరుగుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని అన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిమిషాల వ్యవధిలోనే వేలాది వీర్యకణాలను విశ్లేషించగలుగుతామని తెలిపారు. డిఎన్ఎ సమగ్రతను ఖచ్చితంగా అంచనా వేసి, మరింత సమాచార ఆధారిత చికిత్సా ఎంపికలు చేయడం సులభమవుతుందన్నారు. అధిక నాణ్యత గల వీర్యాన్ని గుర్తించడానికి, పిండం అభివృద్ధిని మెరుగుపరచడానికి, సంతానోత్పత్తి చికిత్సల విజయ శాతం పెంచడానికి గణనీయమైన తోడ్పాటు లభిస్తుందని ఆమె వివరించారు.

# ముమ్మరంగా వరినాట్లు

**● వర్షాలకు నిండిన కుంటలు, చెరువులు ● వరినారు కొతర**



**ప్రజాశక్తి-గన్నవరం :** మండలాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. వారం రోజులుగా కురిసిన వర్షాలతో జోరుగా సాగుతున్నాయి. సీజన్ ఆరంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వరిసాగు చేద్దామా? వద్దా? అనుకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఒక్కసారిగా సాగు పరిస్థితులు మారిపోయాయి. నార్లు పోసిన రైతులంతా పొలాలు దున్ని నాట్లు వేస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా వరిసాగు పనులే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఏలూరు కాలువకు నీరు విడుదల చేయడంతో కాలువ కింద ఉన్న గ్రామాల్లో ఒక్కసారిగా పనులు చేపట్టారు. జక్కుల నెక్కలం, సావర గూడెం, కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం దావాజీ గూడెం, అల్లాపురం, బూతిమిల్లిపాడు గ్రామాల్లో ఎనిమిది వేల ఎకరాల్లో వరి సాగు అవుతుంది.. పొలాల్లో ట్రాక్టర్లతో దమ్ము చేయడం వెంటనే వరి కొనుగోలు చేసి తీసుకువచ్చి నాట్లు వేసేందుకు నడుం బిగించారు.

**నిండిన కుంటలు, చెరువులు :** మెట్ట గ్రామాల్లో చెరువులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలతో మెట్ట ప్రాంతంలోని చెరువులు, కుంటలన్నీ నిండటంతో పాటు కలింగలు పొంగుతున్నాయి. ముఖ్యంగా ముస్తాబాద్‌లో పెద్ద చెరువు, పేడ చెరువులు నీటితో నిండాయి. అదేవిధంగా తెంపల్లి, సూరంపల్లి, వీరపనేని గూడెం, బీబీ గూడెం, చిక్కవరం, కొత్తగూడెం, పురుషోత్తపట్నం గ్రామాల్లో చెరువులన్నీ నిండుకుండలా మారాయి. దీంతో రైతులు ట్రాక్టర్లతో పొలాలను దమ్ము చేయిస్తున్నారు.

**వరినారు కొరత :** వరినాట్లు జోరుగా సాగడంతో వరినారు కొరత ఏర్పడింది. ప్రారంభంలో వానలు పడకపోవడంతో నారుకు నీరందక చాలా వరకు ఎండిపోయింది. వానలు ఒక్కసారిగా పడడం వల్ల వరి వద్దనుకున్న రైతులు కూడా ఇప్పుడు నాట్లు వేస్తున్నారు. అందువల్ల నారు దొరకడం లేదని చెబుతున్నారు. గత నెల 15వరకు 10శాతం దాటని సాగు విస్తీర్ణం ఇప్పుడు 40 శాతం దాటినట్లు లెక్కలను బట్టి తెలుస్తోంది. గన్నవరం మండలంలో ఈ ఏడాది 15వేల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేయగా ఇప్పటివరకు 3 వేల ఎకరాలు దాటింది. కాలవ కింద గ్రామాల్లో 8వేల ఎకరాలు అంచనా వేయగా ఇప్పటివరకు 2 వేల ఎకరాలు దాటింది. ఆగస్టు నెల 15 వరకు వరి నాట్లు వేసుకొనే అవకాశం ఉంది.

## పునఃమూల్యాకనంలో 20.67 శాతం ఉత్తీర్ణత

**ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ :** కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలో 2024 -2025 విద్యా సంవత్సరపు యు.జి. రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షల పునఃమూల్యాకనం ఫలితాలను కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కూన.రాంజీ శుక్రవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డా.పి.వీర బ్రహ్మాచారి తెలిపారు. ఈ పరిక్షలలో మొత్తం 3952 మంది విద్యార్థినీ విద్యార్థులు పునఃమూల్యాంకనంనకు దరఖాస్తు చేసుకోగా 817 (20.67 శాతం) మంది విద్యార్థినీ విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారన్నారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ రిగిస్ట్రార్ ఆచార్య. ఎన్. ఉష మరియు పరీక్షల నియంత్రణాధికారి డా: పి. వీర బ్రహ్మాచారి మరియు తదితరులు పాల్గొన్నారు.



గుంతలమయంగా ఉన్న రహదారి

## ఇదీ... మద్దూరు రహదారి దుస్థితి


**ప్రజాశక్తి-కంకిపాడు :** మండలంలోని గోసాల సెంటర్ నుంచి మద్దూరు కరకట్ట వరకు వెళ్ళే రహదారి అధ్వాన్నంగా బురదమయంగా తయారైంది. చిన్నపాటి వర్షానికే వాహనాలు రోడ్డుపై బురుదలోను వాహనాలు జారిపోతూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం రద్దు చేయాలని ధర్నా




**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ :** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్ఎన్ఎల్ లో పనిచేసి పదవి విరమణ చేసిన ఉద్యోగులను, వారు పదవి విరమణ చేసిన సంవత్సరాన్ని బట్టి విభజించి పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం ద్వారా భవిష్యత్తు పెన్షన్ ప్రయోజనాలు నిరాకరించడాన్ని రిటైర్డ్ ఉద్యోగులు తీవ్రంగా ఖండిస్తున్నారు. శనివారం మచిలీపట్నం బుట్టాయిపేట సెంటర్లో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు విశ్రాంత ఉద్యోగులు మానవ హారంగా ఏర్పడి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎండి యూనస్ మాట్లాడుతూ 8వ వేతన సంఘం సిఫార్సులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయటం ఆలస్యం అంటే న్యాయాన్ని నిరాకరిం చడమేనని, కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించారు. సమాన పనికి సమాన పింఛన్ సూత్రాన్ని అమలు చేసి పాత పెన్షనర్ల ప్రయోజనాలను కాపాడాలని నినాదాలు చేశారు. వ్యాలిడేషన్ చట్టాన్ని తక్షణమే రద్దుచేసి పెన్షనర్ల హక్కులను కాపాడాలన్నారు. మచిలీపట్నం సిఐటియు నగర కన్వీనర్ సిహెచ్ జయరావు, విశ్రాంత పెన్షనర్లు ఆనంద్, ఏ ధర్మపురి, ఏ లక్ష్మణ ప్రసాద్, మోటూరి రామ్మోహన్రావు, బిఎస్ రంగనాథ్, బి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మోడరన్ పెంటాతలన్ పోటీల్లో సాహస ప్రతిభ



**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం నియోజకవర్గంలోని చిన్నఅవుటపల్లి గ్రామానికి చెందిన గోగులమూడి నియా సాహస జిల్లాస్థాయి మోడరన్ పెంటాతలాన్ (రన్నింగ్, ఫెన్సింగ్, స్విమ్మింగ్ ) పోటీలలో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. జూలై 25, 26 తేదీలలో విజయవాడలోని బ్లూమింగ్ డెల్ అంతర్జాతీయ పాఠశాలలో జరగనున్న తొమ్మిదవ రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటాదలేన్ పోటీలలో అండర్ 9 బాలికల కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి నియా విజయ్‌ని జిల్లాలోని ప్రముఖులు ఆంధ్ర కోకో అసోసియేషన్ అధ్యక్షులు తోటకూర శివరామకష్ణ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ సంఘ సంయుక్త కార్యదర్శి ధనియాల నాగరాజు, ఆంధ్రప్రదేశ్ డాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్సులు కోట కష్ణమోహన్, పోకతోట శివకష్ణ, ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్ కుమార్, అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు గోగులమూడి విజయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## బోధనేతర పనుల నుంచి మినహాయించాలని వినతి

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఆటంకంగా ఉన్న బోధనేతర కార్యక్రమాలన్నీ ఉపాధ్యాయులకు తొలగించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబూ రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు , కార్యదర్శి దోనె అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని సమస్యలను తెలియజేశారు. ప్లస్ టు పాఠశాలలను పాఠశాల విద్య లోనే కొనసాగించాలని, ప్లస్ టు పాఠశాలలను కో ఎడ్యుకేషన్ విధానం అమలు చేయడం వల్ల ప్రవేశాలు పెరిగే అవకాశం ఉందని తెలియజేశారు. క్లస్టర్ ఉపాధ్యాయులు సబ్జెక్ట్ టీచర్ అవసరం ఉన్న చోట నియమించి ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారులకు బదిలీలు నిర్వహించి, ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా బదిలీ కోరుకునే వారికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

## డ్రైనేజీల్లో చెత్తాచెదారం తొలగించాలి

**ప్రజాశక్తి-చల్లపల్లి :** డ్రైనేజీలోని చెత్తాచెదారాన్ని తొలగించి చల్లపల్లి ప్రజలను దోమల కాటు నుండి కాపాడాలని సిఐటియు మండల కన్వీనర్ పాలకులను డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ పార్క్ నుండి నారాయణరావు నగర్‌కు వెళ్లే డ్రైనేజీ గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు, తాటి ఆకులు ప్రవాహాన్ని అడ్డుకోవడంతో మురుగు ముందుకు సాగకపోవడంతో దోమలు, ఈగల కు నిలయంగా మారి ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగుబోదులలో వేసవిలో తీయవలసిన పూడిక పనులపై అధికారుల నిర్లక్ష్యం వహించడంతో ఈ దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మురుగు నుండి దుర్వాసన వెదజల్లుతుందని అన్నారు.

## కైకాల సత్యనారాయణకు నివాళి

**ప్రజాశక్తి - గుడివాడ :** పట్టణ కాపు సేవా సమితి ఆధ్వర్యంలో నవరస నటసార్వభౌముడు కైకాల సత్యనారాయణ 90వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో కైకాల విగ్రహానికి కాపు సేవా సమితి, కళాకారులు, పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. గుడివాడ ముద్దు బిడ్డ కైకాల భౌతికంగా లేకపోయినా ఆయన నటించిన చిత్రాల రూపంలో, చేసిన మంచి పనుల ద్వారా తెలుగు ప్రజల హదయాల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. కాపు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నూరు రామకష్ణ, అధ్యక్షులు నరహరిశెట్టిప్రసాద్, కార్యదర్శి మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షులు సుంకర గాంధీ పాల్గొన్నారు.

## ఎల్లో డే వేడుకలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక ఎఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఎల్లో డే-పసుపురంగు దినోత్సవం ఎల్ కె జి, యుకెజి చిన్నారులు జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ ఇసి ఇ శాఖ సీనియర్ లెక్చరర్ ఎవిఎన్ఎల్ సరోజినీ మానవ జీవనంలో ప్రకృతిలో పసుపు రంగు ప్రాధాన్యత, ప్రయోజనాలు గురించి చిన్నారులకు వివరించారు. విద్యార్థులు పసుపు రంగు దుస్తులు ధరించి, అవే రంగు పుష్పాలు, కూరగాయలు, పండ్లు సేకరించి ప్రదర్శించారు. వాటి రూపాలను విచిత్ర వేష దారణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, స్కూల్ వైస్ ప్రెసిడెంట్ కొడాలి వెంకట కష్ణారావు, ప్రిన్సిపాల్ కుంజుమన్, టీచర్స్ శ్రీలత, శ్రీలక్ష్మి,శ్యామల, మాధవి లు పాల్గొన్నారు.

## షటిల్, చెస్ పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - గుడివాడ :** క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడలకు కేంద్రంగా గుడివాడను నిలుపుతామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో కఠారి శ్రీనివాసరావు మెమోరియల్ కృష్ణ జిల్లా షటిల్ టోర్నమెంట్, స్కూల్ చెస్ పోటీలను ఎమ్మెల్యే రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ జాతీయస్థాయి క్రీడాకారిణి గుడివాడకు చెందిన కోనేరు హంపి కావడం తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు. వారిని నేటి యువతరం స్పూర్తిగా తీసుకోవాలన్నారు. చెస్, షటిల్ పోటీల్లో ప్రపంచ స్థాయిలో తెలుగువారు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, కమిటి సభ్యులు కఠారి రామ్‌కుమార్, లంకదాసరి ప్రసాదరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.



చెస్ ఆడుతున్న ఎంఎల్ఏ రాము

## సచివాలయ భవనం ప్రారంభం

**ప్రజాశక్తి-మోపిదేవి :** మోపిదేవికి మరో ప్రధాన రహదారి అవశ్యమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం మోపిదేవిలో ఉపాధి హామీ నిధులు రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా దినదినాభివద్ధి చెందుతున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఎదుట భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు మరో రోడ్డు నిర్మించాల్సి ఉందన్నారు. మోపిదేవి సర్పంచ్ నందిగం మేరీ రాణి అధ్యక్షతన జరిగిన సభలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు పాల్గొన్నారు.



భవనం ప్రారంభిస్తున్న దృశ్యం

## అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాశక్తి-మోపిదేవి :** బొబ్బర్లంక గ్రామాన్ని విస్తతంగా అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం మోపిదేవి మండలం బొబ్బర్లంక ఎస్సీ కాలనీలో జిల్లా పరిషత్ 15 శాతం ఎస్సీ నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ సాధారణ నిధులు రూ.5లక్షలు కలిపి రూ.15 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పిటిసి సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, ఎంపీడీఓ జంగం స్వర్ణ భారతి పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బందికి సన్మానం

**ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ మండలం లింగాలపాడు, తక్కెళ్ళపాడు గ్రామాలలో సచివాలయం వ్యవస్థ స్థాపించిన నాటి నుండి నేటి వరకు సుమారు ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఈ సచివాలయం నుంచి బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందిని సత్కరించారు. లింగాలపాడు, తక్కెళ్ళపాడు గ్రామ సర్పంచ్లు ఏసమ్మ, పద్మజ, గ్రామ పంచాయతీ సెక్రెటరీ సీతారామిరెడ్డి, లింగాలపాడు, తక్కెళపాడు విఆర్ఓ కాకాని కోటేశ్వరరావు నూతన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జయప్రద ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య సేవలు

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు నాలుగు వేల మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి 1500 మందికి ఉచిత కళ్లజోళ్లు అందజేశామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్దన్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రతో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెల 5న పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో కంటి వైద్య శిబిరంతో పాటు డెంటల్, రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కుప్పకూలిన షాపింగ్ మాల్ గడ్డర్లు
### తప్పిన పెను ప్రమాదం

**ప్రజాశక్తి-విజయవాడ:** విజయవాడలో భారీ ప్రమాదం తప్పింది. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు విజయవాడ బందర్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న షాపింగ్‌మాల్ గడ్డర్లు కుప్పకూలాయి. ఈ సమయములో అక్కడ ఎవరూ లేనందున పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తీవ్ర భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు. తెలిసిన వివరాల ప్రకారం...బందర్‌రోడ్డులో నిర్మాణంలో ఉన్న షాపింగ్ మాల్ కుప్పకూలడంతో దానికున్న భారీ ఇనుప గడ్డర్లు ఒక్క సారిగా పడిపోయి రోడ్డుపై, పక్కన భవన్‌పై పడిపోయాయి. రోడ్డుపై పడటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో కూలీలు, భవన యజమానులుంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు, ఇతర అధికారులు క్రేన్ సాయంతో గడ్డర్లను తొలగించారు.

## సిపిని కలిసిన నూతన ఎసిపిలు

**ప్రజాశక్తి-విజయవాడ:** సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూల్ రీజనల్ ఆఫీస్ సిఐడిలో డిఎస్‌పిగా పని చేస్తున్న టి.ద్రైవ ప్రసాద్ ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ మహిళా పోలీస్ స్టేషన్ ఎసిపిగా బదిలీ అయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుక్రవారం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. అలాగే ఎన్‌టిఆర్ జిల్లా మహిళా పోలీసు స్టేషన్‌లో ఎసిపిగా పని చేస్తున్న కె.లతాకుమారి పోలీస్ కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ ఎసిపిగా బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిపిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## మోసపూరిత హామీలతో దగా : వెల్లంపల్లి

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ:** స్థానిక 41వ డివిజన్ ప్రెసిడెంట్ వీధి వద్ద స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఎండి ఇర్ఫాన్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ కేసరి కృష్ణారెడ్డి క్యూఆర్ కోడ్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెల్లంపల్లి మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని ఎన్నికలు అయ్యాక వాటిని అమలు చేయకుండా నిధులు సరిపోవని, గత ప్రభుత్వాలపై నిందలు వేసి పక్కకు తప్పుకోవడం చంద్రబాబుకు అలవాటని విమర్శించారు. ఎన్నికల ముందు టిడిపి నేతలు ఇంటింటికి తిరిగి జగన్ కంటే ఎక్కువ పథకాలు ఇస్తామని మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారన్నారు.



# మునేరు, కట్టలేరుకు వరద



**ప్రజాశక్తి-నందిగామ:** ఎగువన కురుస్తున్న వర్షాలతో పలుచోట్ల వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. నందిగామ మండలం దాములూరు కూడలి-వైరా ఏటికి ఎగువన కురిసిన వర్షాలకు వరద నీరు రావడంతో జలకళ సంతరించుకుంది. కూడలి వైరా కట్టలేరు వద్ద కాజ్ వే పై వరద నీరు పొంగిపొర్లుతుంది. దీంతో నందిగామ మండలం కూడలి -వీరులపాడు మండలం పల్లంపల్లి కి వెళ్లె రాకపోకలు నిలిపివేశారు. నందిగామ తాసిల్దార్ సురేష్ బాబు కూడెలి వద్ద రాకపోకలు నిలిపివేస్తూ సిబ్బందిని ఏర్పాటు చేశారు. వర్షాలకు నందిగామ మునేరు వరద ప్రవాహంతో పరవళ్ల తొక్కుతుంది. మునేరు ఆయకట్టు పంట పొలాలకు వర్షము జీవం పోసింది. పత్తి, మిర్చి, మాగాణి పంటలకు వర్షం ఊపిరి పోసింది.



ఒడ్డుకు చేరిన పడవలు

ఒడ్డుకు చేరిన పడవలు

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** మండలంలోని రావిరాల గ్రామంలో పాలేరు కృష్ణానదిలో కలిసే సంగం ప్రాంతంలో కృష్ణానది పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వరదనీరు పోటెత్తుతుంది. దీంతో నదిలో చేపలు పట్టే జాలర్లు తమ పడవలను ఒడ్డుకు చేర్చారు.

## సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**ప్రజాశక్తి-విజయవాడ:** బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉన్నామని, నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 0866 2574454 నంబరుతో 24 గంటలు పనిచేసేలా విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డివిజన్‌లో వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఈ ఫోన్ నెంబర్‌కి కాల్ చేసి సమాచారం అందించాలని ఆర్డీవో చైతన్య కోరారు.

## తైక్వాండో పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2025 పోటీలకు ప్రత్యేక అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రీడల్లో ప్రతిభచూపి పతకాలు సాధించాలంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి పుట్టిన ఊరుకు జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించడం జరిగిందని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, కెరీర్ పరంగా ఉన్నతంగా ఎదగాలన్నారు. 10వ జాతీయ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ - 2025 పోటీలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయి. కృష్ణాజిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారు.




## రాష్ట్రస్థాయి పోటీలకు ఏకత్వ విద్యార్థులు

**ప్రజాశక్తి-నందిగామ:** వీరులపాడు మండలంలోని పొన్నవరం ఏకత్వ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 13 మంది రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటాతలన్ పోటీలకు ఎంపికవటం ఎంతో గర్వకారణంగా ఉందని పాఠశాల ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ అమరనేని మనోజ్ అన్నారు. 24వ తేదీన ఈడుపుగల్లులోని ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ నందు నిర్వహించిన జిల్లా స్థాయి మోడరన్ పెంటాదలేన్ ఎంపికలలో స్విమ్మింగ్, రన్నింగ్, ఫెన్సింగ్ వంటి క్రీడాంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులు ఈ నెల 26, 27 తేదీలలో విజయవాడలోని బ్లూమింగ్ హేల్ అంతర్జాతీయ పాఠశాలలో జరగబోయే తొమ్మిదవ అంతర జిల్లాల మోడరన్ పెంటాతలేన్ పోటీలలో కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వ్యాయామ విభాగాధిపతి విజయ్‌కుమార్‌ను అభినందించారు.

# ప్రభుత్వ బడులు నిర్వీర్యం



అమ్మిరెడ్డిగూడెంలో మూతపడిన ప్రభుత్వ పాఠశాల

### పాలకుల విధానాలే కారణం?
### ఐదు బడులు మారాల్సిన పరిస్థితి
### ఉపాధ్యాయుల కొరత

**ప్రజాశక్తి-గంపలగూడెం:** విద్యా శాఖ తీసుకుంటున్న నిర్ణయాలతో పలు ప్రభుత్వ బడులు మూతబడుతున్నాయి. మండలంలోని కొనిజర్ల, కనుమూరు మెయిన్, అమ్మిరెడ్డిగూడెం గ్రామాల్లో గత వారం రోజులుగా పాఠశాలలు మూతపడ్డాయి. ఆయా ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ ఆదేశాలతో వేర్వేరు పాఠశాలలకు బదిలీపై వెళ్లినట్లు సమాచారం. పూర్వం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు అనే మూడు అంచెలతో విద్య వ్యవస్థ విస్తరించింది. నేడు అది కాస్త మార్పు చేసి సాటిలైట్ ఫౌండేషన్ స్కూల్స్, ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్ స్కూల్స్, మోడల్ ప్రైమరీ, హై స్కూల్స్‌గా మార్పు చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. గతంలో ఒకే ఇంట్లో ఉన్న అక్క, తమ్ముడు లేదా అన్నా చెల్లెళ్లు ఒకే పాఠశాలలో చదువుకునేవారు. కానీ నేడు ఒకటి, రెండు తరగతులు ఒక పాఠశాలలో చదువుతుంటే, 3, 4, 5 తరగతుల విద్యార్థులు మరో పాఠశాలకు వెళ్ళాల్సి వస్తుంది. అక్కడ నుండి బేసిక్ ప్రైమరీ, హైస్కూల్ ఈరకంగా ఒక విద్యార్థి ఐదు పాఠశాలలు తిరిగి చదువుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. అంటే ఒక విద్యార్థి ఐదు పాఠశాలలకు మారడం వల్ల అలవాట్లలో కూడా మార్పులు వస్తున్నాయన్న విషయాన్ని తల్లిదండ్రులు గమనించారు. వీటన్నిటిని బేరీజు చేసుకుని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గుచూపడం లేదన్నది ప్రధాన ఒక కారణం. గతంలో ప్రభుత్వ పాఠశాలలను నాడునేడు పేరుతో ఆధునీకరణ చేసి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయగా అవి నేడు ఆదరణకు నోచుకోని ఆస్తులుగా మిగిలిపోతున్నాయి. ప్రత్యేకించి గంపలగూడెం మండలంలో ఉపాధ్యాయుల కొరత ప్రధానంగా కనిపిస్తోంది. ఏడాది పాటు డిప్యుటేషన్ల పేరుతో అటుఇటు ఉపాధ్యాయులను మార్పు చేయడంతో పాఠ్య బోధనపై ప్రభావం పడుతుండటంతో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపించడానికి తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు.



## అమ్రితసాయిలో పాలిటెక్నిక్ తరగతులు ప్రారంభం

**ప్రజాశక్తి-కంచికచర్ల**

అమ్రితసాయి ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల పాలక వర్గ కార్యదర్శి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్స్‌లో నాలుగు బ్రాంచులు ఉన్నాయని, పాలిటెక్నిక్ కోర్స్‌తో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని, ఈ టెక్నికల్ కోర్స్‌లో మంచి ప్రణాళికతో పాటు, కళాశాలలో ఉన్న ప్రయోగశాలల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందిచు కోవాలని సూచించారు. పాలిటెక్నిక్ లో సబ్జెక్ట్ మరియు పాఠ్యాంశాల యొక్క ప్రాముఖ్యతను, కళాశాల విధి విధానాలను తల్లితండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యమ్.శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

# షెల్కాల్ న్యూట్రిషన్ పౌడర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్**

శాస్త్రీయంగా రూపొందించబడిన వయోజన పోషకాహార సప్లిమెంట్ పౌడర్ అయిన షెల్కాల్ టోటల్‌ను టొరెంట్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ఆవిష్కరించిందని సంస్థ ఇంచార్జి సుభాష్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న న్యూట్రిషన్ విభాగంలోకి విస్తరించిన, మూడు దశాబ్దాల నమ్మక వారసత్వంతో ఉన్న షెల్కాల్, నూతన ఉత్పత్తులకు శ్రీకారం చుట్టిందని అన్నారు. షెల్కా ల్ ప్రో గమ్మీస్, షెల్కాల్ ప్రో కిడ్స్ గమ్మీస్ వంటి వినియోగదారు అనుకూలమైన ఆవిష్కరణలతో విస్తరించిందన్నారు. ఇది వివిధ వయసు వర్గాలలో బ్రాండ్ ఔచిత్యాన్ని, అభివృద్ధి చెందుతున్న ఆరోగ్య అవసరాలను బలోపేతం చేస్తుందన్నారు.




షెల్కాల్ టోటల్ ఇప్పుడు ఈ బ్రాండ్ పరిణామాన్ని ఆధునిక, వినియోగదారు కేంద్రీకృత పోషకాహార పోర్ట్‌ఫోలియోగా సూచిస్తుందన్నారు.



## ఉత్సాహంగా మహిళల కోలాటం

- 1న ప్రభల ఉత్సవం

**ప్రజాశక్తి-గన్నవరం** : పాతగన్నవరంలోని శ్రీలక్ష్మి తిరుపతమ్మ ఆలయంలో మొదటి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కోలాటంతో సందడి చేశారు. తొలుత ఆలయ సంప్రదాయం ప్రకారం మాను (మహాలక్ష్మి) తొలిపూజ నిర్వహించారు. గ్రామపెద్దలు కాసరనేని బాబూరావు, బేబీసరోజిని దంపతులు పాల్గొన్నారు. జాస్తి శ్రీధర్ ఆర్థికసాయంతో అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో బీసీ కులాలకు చెందిన పెద్దలు అల్లాపురం శంకర్, పడమట సుబ్రహ్మణ్యం, ఈడే సుబ్బారావు, చిమట శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

**ఒకటో తేదీ గన్నవరం గ్రామసంబరం**

పాతగన్నవరంలోని శ్రీలక్ష్మితిరుపతమ్మ అమ్మవారి గ్రామ సంబరాన్ని శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని వచ్చే నెల ఒకటో తేదీన భారీ ఎత్తున ప్రభల ఉత్సవం జరిపేందుకు ఏర్పాటు చేసినట్లు కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధరరావు తెలిపారు. పెద్దసంఖ్యలో ప్రభలు, మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య గ్రామ పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు అత్యంత వైభవంగా ఉంటుందన్నారు.

## తత్కాల్ సేవలను పునరుద్ధరించాలని వినతి

**ప్రజాశక్తి-చల్లపల్లి** : చల్లపల్లిలో రైల్వే తత్కాల్ సేవలు పునరుద్ధరించాని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మచిలీపట్నం పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ బీ.శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. గతంలో నందమూరి హరికృష్ణ రాజ్యసభ సభ్యులుగా ఉన్న సమయంలో చల్లపల్లి పోస్ట్ ఆఫీసులో రైల్వే టికెట్ల బుకింగ్ తత్కాల్ కౌంటర్ ప్రారంభించినట్లు తెలిపారు. ఇటీవల నిలిచిన ఆ కేంద్రం సేవలు పునరుద్ధరించాలని కోరారు

## వాహనాల తనిఖీ

**ప్రజాశక్తి-చల్లపల్లి** : ట్రాఫిక్ నిబంధనలుఉల్లగించిన, సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపిన చర్యలు తీసుకుంటా మని సిఐ ఈశ్వరరావు వాహనదాలను హెచ్చరించారు. శుక్రవారం రోడ్డు భద్రత చర్యలో భాగంగా స్థానిక ప్రధాన కూడలిలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలను ఉల్లఘించిన వాహనదారులు, సరైన డాక్యుమెంట్లు లేని వాహనదారులకు జరిమానాలు విధించినట్లు తెలిపారు.

# ఫలించిన కౌలు రైతు సంఘం పోరాటం



అధికారులతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు


**ప్రజాశక్తి-ఉంగుటూరు** : మండలంలోని ఆత్కూరు పిఎసిఎస్‌లో గత నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన అవకతవకల్లో కౌలు రైతు సంఘం చేసిన పోరాటం ఫలించింది. గ్రామానికి సంబంధించిన కౌలు రైతులు నెహ్రూ జెఎల్‌జి గ్రూపు ద్వారా కర్నాటి రాఘవులు, మట్టా ప్రసాద్, కందుల రవి, ముల్లంగి కోటేశ్వరరావు, బొకినాల లక్ష్మయ్యలు 2011లో ఋణం తీసుకొని 2020 వరకు చెల్లించారు. మళ్లీ 30-6-2021న లక్ష రూపాయల రుణం తీసుకున్నారు. కానీ పిఎసిఎస్‌లో 2021లో సుమారు మూడు కోట్ల రూపాయలు అవకతవకలు జరిగాయి. దీంతో వారు తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో లక్ష రూపాయలు పైగా వడ్డీ, అసలు లక్ష కలిపి రెండు లక్షలు పైన చెల్లించాలని అధికారులు డిమాండ్ నోటీసు ఇచ్చారు. నోటీసు తీసుకున్న గ్రూపు సభ్యులు కౌలు రైతు సంఘం నాయకులకు విషయం తెలియజేయడంతో వారు బ్యాంకు అధికారులతో మాట్లాడారు. తమ గ్రూపు సభ్యులకు సంభందించిన డిపాజిట్ డబ్బు కూడా గల్లంతయ్యిందని, తమ డిపాజిట్ డబ్బులు తమకు చెల్లిస్తేనే రుణం చెల్లిస్తామని రైతులు తెలియజేయడంతో శుక్రవారం గుడివాడ కేడిసిసి బ్యాంకులో ఏజీఎం శ్రీనివాసరావు, తేలప్రోలు బ్రాంచ్ మేనేజర్ ఎం ప్రశాంత్, ఆత్కూరు పిఎసిఎస్ కార్యదర్శి టి సురేష్‌లు చర్చలకు హాజరయ్యారు. గ్రూపు సభ్యులు తరుపున కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, గ్రూపు సభ్యులు కర్నాటి రాఘవులు, కే కిషోర్ తదితరులు పాల్గొని చర్చలు జరపగా రుణం తీసుకున్న నాటి నుండి నేటి వరకు 7 శాతం బారువడ్డీగా లెక్కించి చెల్లించాలనే ఏకాభిప్రాయంతో అంగీకారం తెలిపారు. దీంతో కౌలు రైతు సంఘం అండతో సమస్య పరిష్కారం అయిందని,గ్రూపు సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అవనిగడ్డ మండలంలో కరపత్రాలు అందిస్తున్న నాయకులు

## కరపత్రాలు అందజేత

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక శివారు మేడి లంక, కొత్తపేట, తిప్పపాలెం గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మేడి లంకలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందజేస్తున్న అభివద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కర్ర సుధాకర్, పార్టీ నాయకులు బండే రాఘవ, పర్చూ రీ దుర్గాప్రసాద్, మండలి రామ్మోహన్రావు, మెగా వత్తు గోపి పాల్గొన్నారు. అదేవిధంగా మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో తిప్పపాలెం కొత్తపేట గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. డిసి వైస్ ఛైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, ఎలవర్తి చిన్న, గుడివాడ శివరావు, దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : నియోకవర్గంలో వంద కోట్ల రూపాయలతో డ్రెయినేజిలు, అంతర్గత రోడ్ల నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చినఓగిరాలలో పర్యటించి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అబివృద్ధి పథకాలు ప్రచారం చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజి నిర్మాణం చేపట్టవలసి ఉందని, నిధుల లభ్యతను బట్టి పనులు చేపడతామన్నారు. సర్పంచ్ యెనిగళ్ల శిరీష, ఏఎంసీ ఛైర్మన్ కొండా ప్రవీణ్, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి** : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలోనూ కూటమికి పట్టం కట్టాలని టీడీపీ సీనియర్ నాయకులు బొబ్బా గోవర్ధన్ అన్నారు. శుక్రవారం మోపిదేవి మండలం కోసూరు వారిపాలెం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బోబ్బా గోవర్ధన్ పాల్గొని ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధన్ రావు, జడ్పిటిసి మల్లికార్జునరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి పాల్గొన్నారు.



బందరులో చెక్కు అందిస్తున్న నాయకులు

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా):** మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో 26 డివిజన్‌కు చెందిన ఎన్నేటి శ్రీనివాసరావు' అనారోగ్యంతో బాధపడుతుండంతో మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ 55,546 ఆర్థిక సహాయం కూటమి నాయకులు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపిఅధ్యక్షులు చెరుకూరి సూరిబాబు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ మౌలాలి మాజీ హాస్పిటల్ డైరెక్టర్ అజీమ్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 14.30 లక్షల ఎల్ఓసిలు, చెక్కులను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రోగుల కుటుంబ సభ్యులకు అందజేశారు. గన్నవరం మండలం తెంపల్లి గ్రామానికి చెందిన మెరుగుమాల రంగమ్మ కు రూ.2.50 లక్షలు, బుద్ధవరం గ్రామానికి చెందిన తాడిశెట్టి పల్లవికి లక్ష రూపాయలు, విజయవాడ రూరల్ మండలం నిడమానూరు గ్రామానికి చెందిన పుంద్రోతు వాన్స్ కు రూ.8లక్షలు, బాపులపాడు మండలం ఏ సీతారాంపురం గ్రామానికి చెందిన ములుగు మాటి ఎవంత్ కు రూ.80వేలు, ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన తంగళ్ళమూడి ప్రేమ్ చంద్ కు రూ. 2లక్షలు ఎల్ఓసిలు, చెక్కులు అందజేశారు.

## చిరుధాన్యాలతో ఉత్పత్తుల తయారీపై శిక్షణ

**ప్రజాశక్తి-ఘంటసాల** : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో దాలిపర్రు గ్రామంలో మహిళలకు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారీపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వి.కె సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ చిరుధాన్యాల ఉపయోగాలు గురించి వివరించి ఈ శిక్షణా కార్యక్రమంను మహిళలు వినియోగించుకొని నైపుణ్యం సాధించి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కష్ణవేణి మాట్లాడుతూ చిరుధాన్యాల ఉపయోగాలు, ఆరోగ్య ప్రయోజనాలు లభించే పోషకాలు గురించి వివరించి రాగి లడ్డు, రాగి చాక్లెట్ తయారీని వివరించి తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో జె.యశ్వంత్ కుమార్, మత్స్య శాస్త్రవేత్త మరియు గ్రామ మహిళలు పాల్గొన్నారు

## దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు

**ప్రజాశక్తి-అవనిగడ్డ** : అవనిగడ్డ-నాగాయలంక రోడ్డులో తొమ్మిదో వార్డులోని డంపింగ్ యార్డ్ వద్ద రహదారి పెద్ద పెద్ద గోతులు పడడంతో స్పందించిన చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు యాసం చిట్టిబాబు మిత్ర బృందం శుక్రవారం మరమ్మతులు నిర్వహించారు. ఇటీవల ఈ ప్రాంతంలో ఒక వ్యక్తి ప్రమాదానికి గురై మరో వ్యక్తి తీవ్ర గాయాలు పాలయ్యారు. దీనిపై సోషల్ మీడియాలో కథనాలు రావడంతో చిట్టిబాబు మిత్రబందం స్పందించి రహదారిపై పడిన గోతులను మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో డిసి వైస్ ఛైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, టిడిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, వార్డు సభ్యులు అడపా వెంకటేశ్వరరావు, ఎలవర్తి చిన్న లింగం బాబురావు, విరాటి రాంబాబు పాల్గొన్నారు



## ఆక్రమణల తొలగింపునకు చర్యలు : డిఆర్ఓ

**ప్రజాశక్తి -కలక్టరేట్ (కృష్ణా)** : జిల్లాలో కాలువలు, చెరువులు, డ్రెయిన్లు, వాగుల కట్టలు ఆక్రమణకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి కే చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డిఆర్ఓ కలెక్టరేట్లోని తన ఛాంబర్ నుంచి రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీ తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి వాచ్ డాగ్ కమిటీ సమావేశం నిర్వహించి నీటి కాలువల సంరక్షణపై సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఆక్రమణలు, దుర్వినియోగం వల్ల జలవనరులు అంతరించి దుష్పరిణామాలకు దారితీయకుండా నివారించేందుకు రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్ శాఖల అధికారులు వాచ్ డాగ్ కమిటీ సభ్యులుగా అవసరమైన చర్య లు తీసుకోవాలని సూచించారు. జిల్లా రికార్డుల్లో నమోదైన చెరువులు, వాగులు, కాలువలు, డ్రెయిన్ల వంటి నీటి నిల్వ కేంద్రాలను పరిశీలించి ఇప్పటికే ఆక్రమణకు గురైతే వాటిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పెనమలూరు, చల్లపల్లి, గూడూరు, ఘంటసాల వంటి మండలాల పరిధిలో ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు అత్యధికంగా ఉన్నాయని, అందుకు రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి ఆక్రమణదారులకు నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల స్థలాల లేనివారు అటువంటి స్థలాలలో నివసిస్తున్నట్లయితే ప్రభుత్వ పథకంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఖాళీ చేయించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో బందరు, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే స్వాతి, జి బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారోన్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మోహన్ రావు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, జిల్లా పంచాయతీ తదితర అధికారులు పాల్గొన్నారు.

## గ్రామసభ ఏర్పాటుకు వినతి


**ప్రజాశక్తి-పామర్రు** : మండల పరిధి పెదమద్దాలి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేయాలని ఆ గ్రామ ప్రజలు ఎండిఓ కే.జ్యోతికి వినతిపత్రం సమర్పించారు.గత కొన్ని సంవత్సరములుగా గహ నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికేట్ అలాగే తాగునీటి సమస్య, కుళాయి కనెక్షన్, డ్రైనేజీల నిర్మాణం, రాత్రివేళ విద్యుత్ లైట్ల నిర్వహణ, రహదారుల నిర్మాణం వంటి సమస్యలతో పాటు పేద ప్రజల అవసరమైన పింఛన్ల సమస్యలు వ్యక్తిగత సమస్యలు పరిష్కరించేందుకు గ్రామసభ నిర్వహించాలని అర్జీలో వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరి శివకష్ణ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విరాళం అందజేత

**ప్రజాశక్తి - గుడివాడ** : స్థానిక మెయిన్‌రోడ్‌లో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంపై భాగమున దేవతమూర్తుల విగ్రహాలు ఏర్పాటుకు ఇరువురు కుటుంబ సభ్యులు ఒక్కొక్కరు రూ.10,116లు చొప్పన శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవస్థానం పై భాగంలో ఉన్న దేవతల విగ్రహాలకు వక్తరామ్ శాంతాదేవి దంపతులు రూ.10116లు, భంరా రామ్ దీవాదేవీ దంపతులు రూ.10,116లు చొప్పున అంద జేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా దాతలను దేవస్థానం అర్చకులు సత్కరించారు.

## విద్యార్థుల కోసం శామ్‌సంగ్ కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో పేరుతో విద్యార్థులకు సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సంస్థ ప్రతినిధి ఎం.కుమార్ తెలిపారు. నగరంలో సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. 14 నుండి 22 ఏళ్ల యువ మేధావులకు ఒక జాతీయ ఆవిష్కరణ సవాలు ద్వారా, భవిష్యత్తు మార్పు కోసం లాంచ్‌ప్యాడ్‌లుగా మారుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డిజైన్ థింకింగ్ వర్క్ షాపులు, ఓపెన్ హౌస్ల ద్వారా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రధాన మెట్రోలకే కాకుండా ఈశాన్య భారతదేశంలోని చురుకైన విద్యా కేంద్రాల వరకూ చేరిందన్నారు. ఈ సంవత్సరం, కార్యక్రమం మొదటి అత్యుత్తమ నాలుగు జట్లకు కోటి రూపాయల నజరానాతో పాటు ప్రోటోటైప్ అభివృద్ధికి అవసరమైన అన్ని మద్దతులను అందిస్తోందన్నారు. ఇందులో శామ్‌సంగ్ నాయకులు, ఐఐటి ఢిల్లీ ప్రొఫెసర్లు వంటి నిపుణుల నుంచి దిశానిర్దేశం, చేస్తారన్నారు. ఈ నెలలో ఐదు ప్రముఖ పాఠశాలలు, కళాశాలల నుండి మూడు వేల మందికి పైగా విద్యార్థులు పెద్ద కలలు కనేందుకు, ధైర్యంగా ఆలోచించేందుకు, దేశ భవిష్యత్తును రూపొందించే పరిష్కారాలను సృష్టించేందుకు ఒక వేదిక పైకి వచ్చారని తెలిపారు.




## సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం బాలుర పాఠశాల, కళాశాలలో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్ రవిబాబు తెలిపారు. గతంలో ఎంట్రన్స్ పరీక్ష రాసిన, రాయని విద్యార్థులు ఈ నెల 28వ తేదీ వరకు నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు.

## న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-మైలవరం: న్యాయవాదుల పరిరక్షణకై చట్టాలు చేయాలని ఐ ఏ ఎల్ రాష్ట్ర కార్యదర్శి బుద్ధవరపు వెంకటరావు డిమాండ్ చేశారు. ఐ ఏ ఎల్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక కోర్టు హాల్ వద్ద న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై భౌతిక దాడులు, బెదిరింపులు, కిడ్నాప్, హత్యలు జరుగుతున్నాయని, వత్తిడీత్యా న్యాయవాదులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రావూరి రమేష్ బాబు, జి శ్రీనివాసరావు, ఐఏఎల్ జిల్లా నాయకులు వీటి కిషోర్, శరత్ బాబు, మాజీ అధ్యక్షులు వీవీ శేషగిరిరావు, మధు ఆంజనేయులు, న్యాయవాదులు రాము, తనూజ్, శివ పాల్గొన్నారు.




ప్రజాశక్తి-జగ్గయ్యపేట: న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని, జూనియర్ న్యాయవాదులకు నెలకు 10 వేల రూపాయలు స్టైఫండ్ ఇవ్వాలని, న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్ 10 లక్షలకు పెంచాలనే డిమాండ్లతో సీనియర్ న్యాయవాది ఈవి జగన్నాధరావు ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సహేతుక డిమాండ్ లను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బద్దుల వెంకట రామయ్య, పసుపులేటి సత్య శ్రీనివాసరావు, దామల సంతోష్, ఎం.కృష్ణయ్య, గొనెల వెంకటేశ్వర్లు, శ్రీనివాస గౌడ్, గురువులు రాజు, రావూరి ప్రసాద్, శేష కుమారి తదితరులు పాల్గొన్నారు.



# ప్రొఫెషనల్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

### ఐసిఎఐ నేషనల్ ఫ్యాకల్టీ కౌశిక్ ముకేష్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్
ప్రొఫెషనల్ కోర్సులైన సిఏ, సిఎస్, ఐసిడబ్ల్యుఏ చేసిన వారికి దేశ, విదేశాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా (ఐసిఎఐ) నేషనల్ ఫ్యాకల్టీ సభ్యులు కౌశిక్ ముకేష్ అన్నారు. గాంధీనగర్‌లోని శారద డిగ్రీ కళాశాలలో 'ప్రొఫెషనల్ కోర్సులు – ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై అవగాహనా సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ముకేష్ మాట్లాడుతూ సిఏ కోర్సు చేసిన వారికి మంచి ఆడిటర్‌గా అవకాశాలు ఉన్నాయన్నారు. సిఏ కోర్సు చాలా కష్టమని, కోర్సు చేయలేమని చాలా మంది అనుకుంటారని అవన్నీ అపోహలే అన్నారు. పట్టుదల, ఆత్మ విశ్వాసంతో కష్టపడితే సిఏ కోర్సు సులభంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. ఐసిఎఐ సంస్థకు దేశ వ్యాప్తంగా చాప్టర్లు ఉన్నాయని వీటి ద్వారా కోర్సు అందిస్తున్నారని విజయవాడలో కూడా చాప్టర్ ఉందని అన్నారు. శారద కళాశాల ప్రొఫెషనల్ కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు, శారద ప్రొఫెషనల్ అకాడమీ ద్వారా సిఏలో మంచి అనుభవం గల చార్టెడ్ అకౌంట్ ద్వారా శిక్షణ అందిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి, ప్రముఖ చార్టెడ్ అకౌంట్ కుందా రామనారాయణ మాట్లాడుతూ శారద డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్సు తో పాటు ప్రొఫెషనల్ కోర్సులకు శిక్షణ అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రెజర్ ఎస్.ఎస్.వి.ప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజాశక్తి-మైలవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని జిల్లా ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ సుహాసిని, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్వడం ఎస్సీ కాలనీలో నిర్వహించిన ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. గోతుల్లో నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. గృహాలను పరిశీలించి పాత్రల్లో, తొట్లల్లో లార్వాను గుర్తించి ఆ ఇంటి యజమానులకు లార్వా నివారణ గురించి తెలియజేశారు. లార్వా ఎదుగుదల నివారణ కోసం ఏమి చేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రాల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు:** గత మూడు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సీజ నల్ వ్యాధులు వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ మనోజ విజ్ఞప్తి చేశారు. నివ సించే ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటిలో వాడిన చెత్తను కాళీ ప్రదేశాలలో వేయకుండా మీ ఇంటి వద్దకొచ్చే పారిశుధ్య కార్మిక లకు అందజేయాలన్నారు. చెత్త, బురద, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. **రెడ్డిగూడెం:** నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమణ అన్నారు. బూరుగగూడెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ మణిబాబు మాట్లాడుతూ వారంలో ఒకరోజు ఇంటి పరిసరాల్లో నీటి తొట్లెలను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. పనికిరాని వస్తువులను, టైర్లు, పూలకుండీలు, కొబ్బరి బొండం కాయలలో నీరు నిల్వలేకుండా చేసుకుంటే వర్షా కాలంలో వచ్చే, సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెంగునియా, వైరల్ జ్వరాలు నుండి, మనం కాపాడుకోగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డీ ప్రభాకరరావు, హెల్త్ అసిస్టెంట్ ప్రతాప్, శిరోతేజస్విని, జీనత్ పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావుకు నివాళి

ప్రజాశక్తి- విజయవాడ: రాజకీయాలకు వన్నెతెచ్చిన వ్యక్తి కోట శ్రీనివాసరావు అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విలక్షణ నటుడు, రాజకీయవేత్త , సామాజిక సేవలో ముందుండే పద్మశ్రీ కోట శ్రీనివాసరావును ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకుని వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కోట శ్రీనివాసరావు సంస్మరణ సభను విజయవాడ ఐలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సినీనటుడు బాబుమోహన్ మాటతుతూ మూడు దశాబ్దాల పాటు గురు శిష్యులుగా, అన్నదమ్ములుగా, హిట్ పెయిర్‌గా నిలిచామన్నారు. సూర్యచంద్రులు ఉన్నంతవరకు ఆయన పాత్రలు సజీవంగా నిలిచి ఉంటాయన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను, అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ బాలాజీ షిర్డీ హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ పిఎన్ బస్‌స్టేషన్ పక్కన రీ మోడల్ చేసి, అత్యాధునిక సదుపాయాలు, హంగులతో ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ షిర్డీ హోటల్‌ను విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎపిఎస్ఆర్‌టిసి చైర్మన్, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణరావు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ ధరలకు రుచికరమైన భోజనంతో పాటు వివిధ రకాల ఆహార పదార్థాలను అందిస్తూ, వ్యాపారాభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. హోటల్ రంగంలో వస్తున్న పోటీ తత్వానికి అనుగుణంగా శ్రీ బాలాజీ షిర్డీహోటల్ కూడా మార్పు చెందుతూ కష్టమర్ల ఆదరాభిమానం పొందాలని కోరారు. ఆర్‌టిసి బస్టాండ్ పక్కన, సువిశాల ప్రదేశంలో నిర్వహిస్తున్న ఈ హోటల్ వ్యాపార, ఇతర అన్ని విధాలుగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె నాగుల్‌మీరా, పారిశ్రామిక వేత్త కోగంటి సత్యం, హోటల్ ప్రొప్రైటర్ కె దస్తగిరి పాల్గొన్నారు.


హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎంపి చిన్ని



## విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు పంపిణీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్
విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన గుడ్ హ్యాబిట్స్ క్లబ్ సభ్యులు శుక్రవారం సత్యనారాయణపురంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పాఠశాల విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్‌లను ఉచితంగా అందచేశారు. సిద్ధార్థ విద్యార్థులు తమ క్లబ్ కార్యకలాపాల్లో భాగంగా పాకెట్ మనీ నుంచి సుమారు నాలుగు వేల రూపాయలను రాత సామగ్రి నిమిత్తం విరాళంగా ప్రకటించడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డా.మేకా రమేష్, గుడ్ హ్యాబిట్స్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ రోహిణి కుసుమ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి.బి. సిద్ధార్థ విద్యార్థులు కార్తీక్, మోక్ష, మౌనిక దుర్గాప్రసాద్, వర్షిణి, చారుమతి పాల్గొన్నారు.

## నేడు డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్
జీతాల సమస్యను పరిష్కరించాలని, బోధనేతర పనులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు డిఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలపనున్నట్లు యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జూన్ నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల విషయంలో కేడర్ స్ట్రెంత్ వివరాలు లేకపోవడం, పొజిషన్ ఐడిలు లేక పోవడంతో జూన్, జులై నెల జీతాలకు ఆటంకం ఏర్పడిందన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులకి గురికావాల్సి వస్తుందన్నారు. బోధనేతర కార్యక్రమాలు తగ్గిస్తామని చెప్పిన అధికారులు రోజురోజుకు పెంచడం వల్ల టీచర్స్ ప్రభుత్వ పాఠశాలలో విద్య అందించడానికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. విద్యా శాఖ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నిరసన తెలియజేయనున్నట్లు తెలిపారు.